క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

నింద్ర: మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించారు. అగరం గ్రామంలో పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మే 15వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జిల్లా స్థాయి సర్వేలు నిర్వహిస్తామని ఎంఈఓలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్వే చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వెంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద గోవింద భక్తులకు అన్నదానం

నగరి: వేసవిని పురస్కరించుకొని ఎండ పట్టున వెళ్లే గోవింద భక్తులకు శుక్రవారం భోజనాలు పంపిణీ చేశారు. సాధారణంగా దాహార్తి తీర్చడానికి ఆలయ ప్రాంగణంలో ఓం శక్తి ఆలయ నిర్వాహకులు గంజి ప్రసాదం పంపిణీ చేసేవారు. అయితే శుక్రవారం గోవింద భక్తులు ఎక్కువగా ఆలయంలో సేదదీరడంతో వారికి భోజన సౌకర్యం కల్పించారు. ఎండపట్టున నడిచివచ్చిన భక్తులు ఆలయం వద్ద సేదదీరి తమ యాత్రను కొనసాగించారు.

జాగ్రత్తలు పాటించాలి

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అధిక వేగంతో ప్రయాణించడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. ద్రౌపదీ దేవి కల్యాణం

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లె మిట్ట శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారి కల్యాణం కనులవిందుగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి, ఉత్సవ మూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే మూలికలతో ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సంజీ వంశీకులు సుబ్రమణ్యంరెడ్డి, సంపూర్ణమ్మ, పురుషోత్తం, లక్ష్మి, ఆలయ ధర్మకర్త నాగరాజు, సురేష్‌బాబు, సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కార్వేటినగరం: డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరీ, ఆరోగ్య పర్యవేక్షకులు త్యాగు, చంద్రవల్లి, ల్యాబ్ టెక్నీషియన్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పూర్వ సైనికుల సమ్మేళనం



సమ్మేళనంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు

పాలసముద్రం: మండలంలోని తిరుమళరాజుపురంలో రిటైర్డ్ ఆర్మీ ఎస్.అఫూన్ రాజ్, వి.ధనకృన్ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్వ సైనికుల సమ్మేళనం నిర్వహించారు. చిత్తూరు, మురకంబట్టు, గంగాధరనెల్లూరు డివిజన్ యూనియన్ అధ్యక్షులు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ ఆర్మీలో ప్రాణాలను లెక్క పెట్టకుండా సరిహద్దుల్లో పని బాధ్యతలు నిర్వహించి రిటైరయ్యామని తెలిపారు. ఆర్మీ కుటుంబానికి ప్రభుత్వం పరంగా కావాల్సిన సదుపాయాలను ఐకమత్యంగా ఉండి సాధించాలన్నారు. కార్యక్రమంలో పూర్వ సైనికులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 221లోని ప్రభుత్వ భూమిలో శుక్రవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సుమారు 77 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న భూమిని భవిష్యత్తులో ప్రజా అవసరాల ఉపయోగం నిమిత్తం కేటాయిస్తూ చర్యలు తీసుకున్నారు. ఇటీవల స్థానికంగా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు స్థలం ఆక్రమణలకు గురికాకుండా తహసీల్దార్ బాబు ఆదేశంతో సర్వేయర్ భానుమతి సర్వే చేశారు. సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వీఆర్ఓ, గ్రామ కార్యదర్శి, స్థానిక నేతలు విజయశేఖర్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

- యంత్రాలతో వరి కోతలు
- నాణ్యమైన గ్రాసం రాని వైనం
- ఎండు గడ్డి కొరతతో ఇబ్బందులు
- పశుగ్రాస పథకాలను మరిచిన ప్రభుత్వం
- భారమైన పశుపోషణ

గడ్డికి గడ్డుకాలం

మేత లేక బీడు భూముల్లో అల్లాడుతున్న పశువులు





ఇతర ప్రాంతాల నుంచి ఎండుగడ్డి తరలిస్తున్న రైతులు



పచ్చిగడ్డి తరలిస్తున్న రైతులు

ఎండాకాలం వచ్చిందంటే పచ్చిగడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశుపోషణ అంతా ఎండు గడ్డిపైనే ఆధారపడి ఉంటుంది. గతంలో ఎండుగడ్డికి లోటు ఉండేది కాదు. కానీ కొన్నేళ్లుగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. దీంతో మూగజీవాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని అధిగమించే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

–కార్వేటినగరం

కొన్నేళ్లుగా కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు యంత్రాలతో వరి కోతలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో తరచుగా వస్తున్న మార్పులతో పంటను హడావిడిగా ఒబ్బిడి చేసుకునేందుకు యంత్రాలతో కోతలకే రైతులు సిద్ధపడుతున్నారు. కూలీలతో పోలిస్తే యంత్రాలతో కోతల వలన ఖర్చు, సమయం ఆదా అవుతోంది. అయితే కూలీలతో కోతలు కోయిస్తే పశువులకు అవసరమైన ఎండుగడ్డి పెద్ద మొత్తంలో లభిస్తుంది. అదే యంత్రాలతో కోతలు కోస్తే పొలాల్లో నాణ్యమైన ఎండుగడ్డి రావడం లేదు. యంత్రాలతో కోతలతో వరి దుబ్బులో సగానికి పైగా నేలమీదే ఉండి పోతోంది. మిగిలిన సగం యంత్రంలో నలిగిపోయి. పశువులు తినడానికి పనికి రాకుండా పోతోంది. అక్కడక్కడా యంత్రాలతో కోసిన గడ్డిని పశువులు తినడం లేదని రైతులు చెబుతున్నారు. మరో వైపు పంట పొలాలను కొన్ని చోట్ల రియల్ ఎస్టేట్ లే ఆవుట్లుగా, మరి కొన్ని చోట్ల మామిడి, జామ, నిమ్మ, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణాలతో కూడా పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది.

పశుగ్రాసం పథకాలు దూరం

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో కనిష్టంగా 25 సెంట్లు, గరిష్టంగా 2.5 ఎకరాలు సొంత భూమి కలిగి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంపకానికి చేయూతనిచ్చేవారు. సైలేజ్‌గడ్డి, టీఎంఆర్ దాణా, పశుగ్రాసం పెంచడానికి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించేవారు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి కొరత లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పశుగ్రాసం పథకాలను పక్కన పెట్టేశారు. దీంతో ఈ ఏడాది రబీ కోతలు మొదలైన తొలి దశలోనే పశుగ్రాసం కొరత రైతులను వెంటాడుతోంది.

పెరిగిన ధరలు

కేవలం కూలీలతో కోతలు కోసిన గడ్డి మాత్రమే పశువులకు పనికి వస్తుండడం, అదీ అతి తక్కువగా మాత్రమే అందుబాటులో ఉండడంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.12 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి నేరుగా పొలాల్లోనే వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్లతో తరలించడంతో స్థానికంగా గడ్డికి బాగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో పశువులకు మేత దొరకడం కష్టంగా మారిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పశువుల వివరాలు..

పాడి ఆవులు	-	4,67,507
గేదెలు	-	1036
మేకలు	-	13,80,063
గొర్రెలు	-	4,38,362

పశువులకు అవసరమైె ఎండుగడ్డి రోజుకు 3 మెట్రిక్ టన్నులు

ఎండుగడ్డి దొరకడం లేదు



వాతావరణం అనుకూలించక పోవడంతో ప్రస్తుతం అన్ని చోట్లా యంత్రాలతో కోతలు జరుగుతున్నాయి. దీంతో ఎండుగడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో మనుషులతో కోతలు జరిగేవి. అప్పుడు ఎండుగడ్డి పుష్కలంగా ఉండేది. ఇప్పుడు ఎక్కడ వెతికినా ఎండుగడ్డి దొరకడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ఎండలు ముదరడంతో పచ్చిగడ్డి దొరికే పరిస్థితి లేదు. ఎండు గడ్డి దొరక్కపశు పోషణ కష్టంగా మారింది.

–జబ్బార్, పాడిరైతు, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

అప్పుడు అమ్మేవాళ్లం.. ఇప్పుడు కొనాల్సి వస్తోంది.



యంత్రాలు వచ్చాక పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో కోతలు కోసి కుప్పలుగా వేసే వాళ్లం. దీంతో పశుగ్రాసానికి ఇబ్బందులుండేవి కావు. చాలా గడ్డి అందుబాటులో ఉండేది. ఇతర ప్రాంతాల వాళ్లు ఇక్కడకు వచ్చి ఎండు గడ్డి కొనుక్కునేవారు. కానీ ఇప్పుడు మా సొంత గేదెలకే గడ్డి లేకుండా పోయింది. ఇతర ప్రాంతాల నుంచి గడ్డి కొనుక్కు రావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో పశువులను పెంచడం మోయలేని భారంగా మారింది. అందుకే చాలా మంది పశువులను అమ్ముకుంటున్నారు.

–రమేష్, పాడి రైతు, ఎస్కే పురం, పాలసముద్రం మండలం

ఆకట్టుకున్న బలిబండి ఉత్సవం

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం బలిబండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బండి కూడు తీసుకువెళ్లి బకాసురుని భీముడు సంహరించే ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు కళ్లకు కట్టినట్లుగా కథ కాలాక్షేపం చేశారు. దీంతో సాయంత్రం భీముని వేషధారి ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారతంమిట్ట జన సంద్రంగా మారింది. గ్రామంలో మొక్కులున్న భక్తులు కూడా ఎడ్ల బండ్లతో గ్రామవీధుల్లో ఊరేగారు. మహిళా భక్తులు ఇంటింటా బండి కూడును సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నగరి: జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా మున్సిపల్ పరిధి, పుదుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ బిందు, సబ్ యూనిట్ ఆఫీసర్ శివముని ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిలువ ప్రాంతాలు పరిశీలించి శుభ్రం చేయాలన్నారు. ఈ మూడు పద్ధతులు పాటిస్తే డెంగీను ఓడించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో వర్షం

వెదురుకుప్పం: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు. అయితే సాయంత్రం ఒక్క సారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. మండలంలో పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడింది. వర్షంతో ప్రజలు సేదదీరారు. ఉరుములు, మెరుపులు ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అవినీతి ఉపాధిని అడ్డుకోండి

- ఉపాధిలో రూ.30 లక్షలు అవినీతి
- పన్నూరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్
- గ్రామాల్లో గంజాయిని అరికట్టండి



ఏపీఓను ప్రశ్నిస్తున్న సర్పంచ్ కుమార్

విజయపురం: ఉపాధి హామీ పనుల్లో అవినీతి ఎక్కువైందని, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పన్నూరు సర్పంచ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీల్లో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. పన్నూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శిస్తున్నాడని, రోజుకి అదనంగా పనులకు రాని 30 మంది ఉపాధి కూలీల పేర్లను మస్టర్‌లో చేర్చి డబ్బులు దోచేస్తున్నాడని ఆరోపించారు. సంబంధించిన ఆధారాలు ఏపీఓకు చూపించామని సర్పంచ్ కుమార్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. ఆధారాలతో సహా చూపించినా ఇంత వరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలో ఉపాధి హామీ పనుల్లో సుమారు రూ.30 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు ఆరోపించారు. జిల్లా అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సర్పంచ్ తీర్మానం లేకుండ అధికారులు, సిమెంట్ రోడ్డు వేయడం ఏమిటని ప్రశ్నించగా.. ఎమ్మెల్యే చెప్పిన వారికి మాత్రమే సిమెంట్ రోడ్డు వేయడానికి అనుమతి ఇస్తున్నామని, తమ చేతిలో ఏమీ లేదని పీఆర్ ఏఈ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అవినీతి అక్రమాలపై త్వరలో కోర్టుకు వెళ్లనున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి ఎక్కువైందని, యువత తప్పు దారి పడుతున్నారని వెంటనే గంజాయిని అరికట్టాలని సర్పంచ్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దార్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పంచభూత మహాయాగం



యాగపూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట నందనార్ స్వామి ఆలయంలో శుక్రవారం పంచభూత మహాయాగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఇప్పటికే ప్రజా సంక్షేమాన్ని ఎంచి ఇతర రాష్ట్రాలలో 28 పంచభూత మహాయాగాలను పూర్తి చేశామని నగరి మున్సిపాలిటీ కేవీపీఆర్‌పేటలో 29, 30వ పంచభూత యాగాలను నిర్వహించామని యాగ నిర్వాహకులు తిరువియార్ రమేష్ స్వామి తెలిపారు. 48 రోజుల పాటుగా నిర్వహించిన ఈ యాగపూజలు శుక్రవారం నిర్వహించిన మహాయాగంతో ముగింపునకు చేరుకుందన్నారు. 18 సిద్ధుల ఆశీస్సులు ప్రజలకు అందాలన్న ఆకాంక్షతోనే ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పూజలకు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు యాగ నిర్వాహకులు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

గురువర్మ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ నాయకుడు, పేద ప్రజలకు వైద్య సిబ్బందిగా ఎనలేని సేవలు అందించిన గురువర్మ(52) మృతి జీర్ణించుకో లేనిదని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి అన్నారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కార్వేటినగరానికి చేరుకుని గురువర్మ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కరోనా సమయంలో గురువర్మ తన ప్రాణాలకు తెగించి మండల ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు. వైఎస్ఆర్ సీపీ నాయకుడిగా పార్టీకి ఎనలేని సేవ చేశారని అన్నారు. ఎంపీపీ లతాబాలాజీ, మాజీ జడ్పీటీసీ సభ్యులు దేవకీ లోకనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మండల కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి డాక్టర్ రవిరాజు, వైద్య సిబ్బంది నివాళులర్పించారు.

శ్రీరంగరాజపురంలో..



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి సంపంగి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గం ఇన్‌చార్జి విజయానందరెడ్డి శుక్రవారం 49 కొత్తపల్లి మిట్ట గ్రామంలో సంపంగి మత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, స్థానిక సర్పంచ్ ఢిల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డి బాబు, జిల్లా యువ నాయకుడు శ్యామ్, సైకిలా, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజ్, నాయకులు జనార్దన్, యేసయ్య, గోవిందరెడ్డి, యుగంధర్, మణి, ముత్యాలు, బాబు, ప్రసాద్‌రెడ్డి, దొరస్వామి, రమేష్, హరిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు





ముస్తాబైన వీరాంజనేయ స్వామి దేవస్థానం, కొండ చుట్టు దారి ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు: మండలంలోని గోవిందరెడ్డిపల్లిలో వెలసిన శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ జరగనున్న హనుమాన్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో 20వ వార్షిక హనుమాన్ జయంతి మహోత్సవం సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల స్వామి కల్యాణోత్సవ కార్యక్రమం, శ్రీరామ కోటి భజనలు, చెక్కభజనలు, కోలాటాలు మేళతాళాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమంతుని ఊరేగింపు కొండచుట్టు కార్యక్రమం కోసం సర్పంచ్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి సొంత ఖర్చులతో దారి ఏర్పాటు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ముళ్లు, రాళ్లతో దారిలో ఊరేగింపు కష్టతరంగా ఉండేది. ప్రస్తుతం సురేంద్రరెడ్డి దారి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



సత్యమ్మ దేవత

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం, చెరువుముందరకండ్రిగ గ్రామంలో వెలసిన సత్యమ్మ దేవతకు శుక్రవారం గ్రామస్తులు మండల పూజల్లో భాగంగా వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామస్తులు అంబలి పోసి పాలు, చందనంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వివిధ కూరగాయలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు.



అమ్మవారికి అంబలి తీసుకొస్తున్న మహిళలు

ఘనంగా అర్జున తపస్సు

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ద్రౌపది అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అర్జున వేషధారణలో తపస్సుమాను ఎక్కే సన్నివేశం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 161 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సంస్థ ప్రతినిధులు

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 161 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి, 1ఎం1బి డైరెక్టర్ అభిరామ్ నటరాజన్, మేనేజర్ శృతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, నరసింహులు, ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్షణ కవచం

- ఆర్డీఓ భవానీశంకరి
- ముందుచూపుతో వ్యవహరించాలి
- డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్



సమావేశానికి హాజరైన జనం



అంజలి ఘటిస్తున్న అధికారులు

నగరి: అనుకోని విపత్తు సంభవిస్తే.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అదే రక్షణ కవచమని ఆర్డీఓ భవానీశంకరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణ ప్రజలకు విపత్తుల్లో అప్రమత్తతపై ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విపత్తు అన్నది భూకంపాల ద్వారా గానీ, తుపాను రూపంలో గానీ, వరదల రూపంలో గానీ, అగ్ని ప్రమాదం రూపంలో గానీ, యుద్ధాల ద్వారా గానీ రావచ్చని తెలిపారు. విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే.. ప్రభుత్వం తీసుకునే సహాయ చర్యలు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం తదితర అంశాలను వివరించారు. జనాభా ఎక్కువగా ఉన్న అపార్టుమెంట్లలో విపత్తు సమయంలో నష్టాలు ఎక్కువ ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి ఆసుపత్రికి చేర్చే దాకా ఎలాంటి పద్ధతులను అవలంభించాలన్న అంశాలను ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది ప్రత్యక్షంగా చేయించి కళ్లకు కట్టినట్లు చూపించారు. డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ అప్రమత్తతతో వ్యవహరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం యుద్ధాలు, బాంబులు పడడం లేకపోయినా వాటి గురించి తెలుసుకోవాలన్నారు. బాంబుల ప్రయోగం జరిగితే ముందస్తు సమాచారం అందుతుందని, ఆ వెంటనే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగుతుందన్నారు. సైరన్ మోగగానే షెల్టర్లకు వెళ్లిపోవాలన్నారు. మళ్లీ సైరన్ మోగేదాకా అలానే ఉండాలన్నారు. ఘటనా స్థలాలకు అగ్నిమాపక, పోలీసు ఎన్డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, విద్యుత్తు తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది చేరుకునే వరకు అప్రమత్తత తప్పనిసరన్నారు. విపత్తు సంభవిస్తే 100 నెంబరుకు గానీ, 9281448313, 8577236122, 8333905022 నెంబర్లకు సంప్రదించాలని ఆర్డీఓ సూచించారు. వైద్యులు మహేష్, కార్తిక్ ప్రమాదాలు జరిగిన సమయంలో చేపట్టాల్సిన ప్రథమ చికిత్స, అవసరాలకు అందుబాటులో ఉంచుకోవాల్సిన మందులను వివరించారు. సమావేశం చివర యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్లకు మౌనం పాటిస్తూ అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వెంకటముని, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.